
# ఈ కథకు శీలం వుంది



పులి వాతపడ్డ లేడి నెత్తురులా ఎర్రగా వెలిగిపోతున్నాడు సూర్యుడు. చిన్న చిన్న జంతువులన్నీ చెల్లా చెదురయినట్లు మేఘాలన్నీ ఎప్పుడో మటుమాయమయిపోయాయి... ఆకాశం అరణ్యం, అరుణ వర్ణంతో చిక్కగా వుంది. నెత్తురు ముద్ద లాంటి ఆహారం నోట్లో చిక్కబడి, పొదలోకి లాక్కొని పోబడుతూన్నట్టు సూర్యుడు దిగంతాల్లోకి జారిపోతున్నాడు లోకంపై చీకటి తెరలు తెరలుగా పరచుకుంటూంది.!

శిరీష కిటికీ దగ్గర నిలబడింది. ఆమెకు అలా సాయం సంధ్యను చూస్తున్న కొద్దీ మనసు బరువెక్కుతూంది. గుండెల్లో తెలియని అలజడి... ఆందోళన !భయం...! అర్థం కాని మథనం ! ఆమె మస్తిష్కంలో జవాబులేని ప్రశ్న... తనేం చేయాలిప్పుడు ?

బావ నవీన్, యీ రోజు ఉదయమే బెంగుళూరు నుంచి వచ్చాడు. మూడు నెలలు శెలవుపెట్టి మరీ వచ్చాడట ! ఈ శెలవుల్లో తమ పెళ్లి జరిగిపోవాలని ఇంట్లో వాళ్ళందరూ పట్టుబడుతున్నారు. పది పదిహేనురోజుల్లో ముహూర్తం పెట్టాలని ఆలోచిస్తున్నారు. తను బావను పెళ్ళిచేసుకోవాలి... ఎలా ?

బావతో పెళ్ళి తనకు యిష్టం లేదా ? ప్చ్ ! కాని బావతో తన పెళ్ళి జరగదు...! జరగటానికి వీల్లేదు... బావను తను పెళ్లి చేసుకోదు... పెళ్ళి చేసుకోడానికి తన మనసు ఒప్పుకోదు. ఆత్మవంచనకు తను లోనుకాదు... బావ నవీన్

బెంగుళూరులో ఎయిర్‌ఫోర్సులో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. సంవత్సరానికి ఒకటి రెండు సార్లు శెలవుమీద వస్తాడు. వచ్చినప్పుడల్లా కొత్తరకం చీరెలు ఏవో బహుమతులు ప్రత్యేకంగా తనకోసం తెస్తాడు. సరదా కబుర్లు... కవ్వింపులు... నవ్వులు... సినిమాలు...షికార్లు ఒకటే హడావుడి శెలవులో బావ ఇక్కడున్నంతకాలం తనకు ఊపిరాడదు. అంతటి ఆనందం ! ఆ ఆనందం... అనుబంథం, బావతో ఇక ముందు కూడా ఎలాసాగుతుంది ? ఎలా...?

శిరీష కిటికీలోంచి చూస్తూ పిచ్చిగా నవ్వుకుంది.

చిన్నతనంలో ఊహ తెలిసినప్పటినుంచి అత్తయ్యా, అమ్మా తనను బావకు పెళ్ళాం అంటూ ఆట పట్టిస్తోంటే... తెలిసీ తెలియని ఓ నవ్వు నవ్వి ఊరుకునేది... వయసు మీరిన తరువాత బావను తన భర్తగా అందరూ అభివర్ణిస్తూంటే మధురోహలు ఏవో మనసుస్పృశించి తనువంతా పులకరింపుతో తేలియాడేది. బావను భర్తగా భవిష్యత్తులో గడిపే ఎన్నో తియ్యటి తలపులు... అంచెలు అంచెలుగా తన అంతరంగంలో దాచుకున్న బావ సుందర రూపం ! చిన్ననాటి చెలిమితో... స్నేహంతో... ఆట పాటలతో, పోట్లాటలతో పెంచుకున్న ఆత్మీయత... అనుబంథం ! ఎలా ఇప్పుడు ?

"ఒసేవ్ ! శిరీషా ! ఎంతసేపలా కిటికీ నంటిపెట్టుకుని నిలబడతావే ? చీకటి పడిందన్న స్పృహ కూడా లేదా నీకు ? గదిలో లైటు వెయ్యి... ఏవిటో రోజు రోజుకు మరీ మూగదానివిలా తయారవుతున్నావు. అంతా ప్రారబ్దం ! బావ, నిన్ను వాళ్ళింటికి రమ్మని ప్రొద్దుట్నుంచి ఒకటే కబురు చేస్తున్నాడు. తయారయి వెళ్ళు ! కాస్త సరదాగా కాలక్షేపం చెయ్యవే తల్లీ !" వంటగదిలోంచి తల్లి సుభద్రమ్మ కేకలు... వేడుకోలు, శిరీష చెవినబడ్డాయి అయినా ఆమె కిటికీని వదిలి పెట్టలేదు.

బావ ఉదయం నుంచీ కబురు చేస్తున్నాడు. నిజమే ! తను వెళ్ళాలా ఇప్పుడు ? వెళ్ళాలి... వెళ్ళి తన బరువంతా దింపేసుకోవాలి... లేకపోతే తనకు మనశ్శాంతి లేదు... అసలు బావతో విషయం ఉన్నదున్నట్లు చెప్పగలదా తను ? చెప్పాలి ! తప్పదు! ఈ పెళ్ళి తనకిష్టం లేదని విధిగా తను చెప్పాలి.

ఆ రోజు తను ఎలా మరిచిపోగలదు ? మరిచిపోకుండా మనసును ఎలా సరిపుచ్చు కోగలదు? తనకన్న (న్నె) కలల్ని, ఆశల్ని భయంకరంగా తుడిచి పారేసిన తుఫానులాంటి ఆ రోజు...

శిరీష ట్యూషన్ కెళ్ళి ఇంటివైపు ఒంటరిగా నడుస్తోంది... రాత్రి - ఏడున్నర గంటలు... చలికాలం... రోడ్ల మీద పట్టపగలులా వెలుగుతూన్న - నియాన్ లైట్ల వెలుగు... పరిగెడుతూన్న వాహనాలు! ఫుట్‌పాత్ మీద పలచగా నడుస్తోన్న మనుషలు.

రోడ్డు మీద మలుపు తిరిగి తమ వీథి లోకి మళ్ళే మరో రోడ్డు పట్టింది శిరీష... నాలుగడుగులు నడిచిందేమో, వెనుక నుంచి సర్రుమని దూసుకు వచ్చి టాక్సీ ఒకటి ఆమె ప్రక్కన ఆగింది... భయంతో తుళ్ళిపడి, రెండడుగులు ఎడంగా తప్పుకుంది శిరీష!

అంతే ! టాక్సీలోంచి, గెడ్డం పెరిగి కళ్ళజోడు పెట్టుకున్న రౌడీలాంటి మనిషి.. ఒకచేత్తో ఆమె రెక్క పట్టుకుని మరోచేత్తో నోరు మూసి లోపలికి లాగాడు... ఆమె కేకవేయబోయి గిజాయించు కుంటూ, టాక్సీలో పడింది... టాక్సీ ముందుకు

దూసుకుపోయింది.

క్షణకాలం శిరీషకు ఏం జరిగిందో అర్ధం కాలేదు... అర్థమయిన తరువాత శిరీష పెనుగులాడింది. ప్రతిఘటించింది. ఆగంతకుడు టాక్సీలో ఆమె మీద పడి బలవంతంగా నోట్లో గుడ్డలు కుక్కాడు... మరో వ్యక్తి కాళ్ళూ చేతులూ కట్టేశాడు... వాళ్ళిద్దరూ త్రాగి ఉన్నట్టుగా వాసన గుప్పుమంది. శిరీష నిస్సహాయంగా ఏడుస్తూ... మూలుగుతూ ఉండిపోయింది. ఆమె మెదడు స్తంభించిపోయింది...

అరగంట తరువాత టాక్సీ ఓ పాడు బడ్డ ఇంటిముందు ఆగింది... చుట్టూ చెట్లు... చీకటి... కీచురాళ్ళరొద ! శిరీష పరిసరాల్ని పరిశీలనగా చూసింది. టాక్సీలోంచి వాళ్ళిద్దరూ శిరీషను మోసుకుపోయి ఓ గదిలో పడేశారు... ఆ గదిలో కూడా రాళ్ళు... ఇటుకలు ! ఆ రాళ్ళ మీదే ఆమెను పడవేసి చీకట్లో దారుణంగా రెండు గంటలు ! ఒకళ్ళ తరువాత ఒకళ్ళు.... ఆమె శరీరంతో యథేచ్ఛగా ఆడుకుని... నిర్దాక్షిణ్యంగా వదిలి వెళ్ళిపోయారు... చిత్రహింసననుభవించి... స్పృహతప్పి మళ్ళీ ఎప్పుడో మెలకువ వచ్చి, చివికిన శరీరంతో... చిరిగిన బట్టలతో కొన ఊపిరితో దేక్కుంటూ రోడ్డు మీదకు వచ్చింది.

ఎక్కడ్నుంచో అదే రోడ్డున మోటారు సైకిలు మీద వస్తోన్న ఇన్‌స్పెక్టర్ మోహన్ ఆమెను చూశాడు... వివరాలు కనుక్కుని ఇంటికి చేర్చాడు... జరిగింది విని ఇంట్లో అంతా గొల్లుమన్నారు... విషయం బయటి వాళ్ళెవ్వరికీ తెలియకుండా గప్‌చిప్‌గా ఊరుకున్నారు. ఇన్‌స్పెక్టరు మోహన్ దర్యాప్తుచేశాడు. చేస్తున్నాడు. ఆగంతకులు ఎవరన్నదీ ఇప్పటికీ తెలియలేదు...

శిరీషకు గతం మనసులో మెదిలింది. భారమైన ఓ నిట్టూర్పు విడిచింది.

'తను కన్న కలలు కరిగిపోయాయి. ప్రాణంకంటే ఎక్కువయిన తన శీలాన్ని ఆ దుర్మార్గులు కొల్లగొట్టారు... కోడెత్రాచుల్లా తన బ్రతుకును కాటేసి పారిపోయారు... తనిప్పుడు బావను పెళ్ళెలా చేసుకుంటుంది ? తను శీలవతి కాదు... తనలో పవిత్రతలేదు.. తను అనాఘ్రాత పుష్పంకాదు... కాని తల్లీ తండ్రి కలసి జరిగిన దారుణం బావకు తెలియకుండా పెళ్ళి చేసెయ్యాలను కుంటున్నారు. ఎలా ? ఇదెలా సాధ్యమవుతుంది ?'

"హాయ్ ! శిరీ ! ఉదయం నుంచి నీ కోసం కబురు చేస్తోంటే ఎప్పటికీ రావేంటి...? ఏం చేస్తున్నావు ఇంట్లో ? పద ! అలా బయటకు వెళ్దాం !" నవీన్ గదిలోకి వచ్చాడు.... శిరీష తొట్రుపాటుగా ఇటు తిరిగింది.

"అదే నవ్వు... అదే చిలిపితనం !" శిరీషలో చెప్పలేని - భా(బా)వ సంచలనం !

"ఏంవిటీ ! డల్‌గా ఉన్నావు ? నడు ! అయిదు నిముషాల్లో తయారవ్వాలి. అలా రోడ్డు మీదకు వెళ్ళి 'సఫేరా' లో కాఫీ త్రాగి - గాంధీ పార్కులో కాస్సేపు కూర్చుని వద్దాం ! నీతో చాలా కబుర్లు చెప్పాలి !" అవును బావా ! నీతో నేను ఒక ముఖ్యమయిన విషయం చెప్పాలి...:"

శిరీష మనసులో అనుకుంటూ చిన్నగా నవ్వింది... ఆ నవ్వులో జీవం లేదు.

"కూర్చోబావా ! అయిదు నిముషాల్లో తయారయి వస్తాను !" శిరీష మరో గదిలోకి వెళ్ళింది. అన్నట్టుగానే... అతి సాధారణంగా అలంకరించుకుని వచ్చింది... ఇద్దరూ ఇంట్లో చెప్పి

బయటకు నడిచారు.. బయట వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. రోడ్లు కళకళలాడుతున్నాయి... నియాన్ లైట్లు వెలుగును విరజిమ్ముతున్నాయి... ఆనందం అంతా తమ ఒక్కరి సొత్తేనన్నట్లుగా ఎన్నో అందమైన జంటలు కదిలిపోతున్నాయి.!

శిరీష, నవీన్ ఫుట్‌పాత్ మీద నడుస్తూ హోటల్ 'సఫేరా' ముందు ఆగారు. లోపలికి నడిచి ఫేమిలీ రూమ్‌లో కూర్చున్నారు. నవీన్ రెండు కాఫీలు ఆర్డరు చేశాడు. ఇద్దరు త్రాగుతూ కూర్చున్నారు.

"ఏంవిటి ? అమ్మాయిగారికి సిగ్గు ఎక్కువయిందా ! ప్రొద్దుట పది గంటలకు వస్తే కనీసం నన్ను చూడటానికి కూడా రాలేదు.... అవునులే ! ముహూర్తం దగ్గరపడుతోంది కదూ !' నవీన్ నవ్వుతూ అన్నాడు.

"అదేం కాదు బావా ! ఈ మధ్య ఆరోగ్యం అంతగా బాగుండటం లేదు !" శిరీష అప్రయత్నంగా అబద్ధమాడింది...

"అవును... అత్తయ్య చెప్పింది... నువ్వు చాలా దిగులుగా ఉంటున్నావట ! ఏదో పరధ్యానం అలవాటయ్యిందట... కారణం... నాతోనూ, చెప్పకూడదా ?"

శిరీష మాట్లాడలేదు... ఇద్దరూ కౌంటరులో బిల్లు చెల్లించి బయటకు నడిచారు. నవీన్ ఒకటే జోకులు వేస్తున్నాడు. హాస్యాలాడుతున్నాడు. చిలిపిగా చెవిలో గుసగుసలాడుతున్నాడు.... శిరీష ముసిముసిగా నవ్వుతూంది. ఏవో భావాల్ని అణచిపెట్టుకుంటూన్నట్లు మునిపంటితో పెదాల్ని నొక్కిపెడుతూంది. ఇద్దరూ పార్కులోకి వచ్చారు. ఒక మూలంగా కూర్చున్నారు. పార్కులో జనం అంతగా లేరు. సామాజిక రేడియో పల్లెసీమల కార్యక్రమం ఏదో ప్రసారం చేస్తోంది...

శిరీష అంతర్యంలో తెలియని బాధ, తొట్రుపాటు!

బావతో విషయం ఎలా చెప్పటం ? ఇద్దరు దుర్మార్గులు తనను దారుణంగా చెరిచి శీలాన్ని దోచుకున్నారని... తను బావను పెళ్ళి చేసుకునే అర్హతను కోల్పోయిందని... ఎలా-ఎలా చెప్పాలి ? ఏమైనా కళంకిణిగా బావను పెళ్ళి చేసుకోలేదు... ఆజన్మాంతం తను బ్రహ్మచారిణిగానే ఉండిపోతుంది... అంతే...!

"బావా ! నీకో విషయం చెప్పాలి !" శిరీష నవీన్ ముఖంలోకి సూటిగా చూస్తూ అంది.

"నువ్వు చెప్పేదేమిటో నాకు తెలియదుగాని... వచ్చినప్పటినుంచి నీకోసం చూస్తున్నాను. నేనూ నీకో విషయం చెప్పాలి" నవీన్ అన్నాడు... అతని గొంతు విచిత్రంగా మారిపోయింది... విషాదాన్నేదో పులుముకున్నట్టయింది.

"ఏంవిటిబావా ! ఆ విషయం ఏదో నువ్వే ముందు చెప్పు !" శిరీష నిర్లిప్తంగా అంది. నవీన్ ఆమెకు మరింత దగ్గరగా జరిగాడు.

"చిన్నప్పటి నుంచీ మనం చనువుగా పెరిగాం! స్నేహంగా తిరిగాం ! మనసులు ముడిపడ్డాయి... భార్యా భర్తలు గానే అందరిలోనూ ముద్రవేయించుకున్నాం ! కొద్ది రోజుల్లో నిజంగానే దంపతులం కాబోతున్నాము... మన మధ్య అరమరికలు, రహస్యాలూ ఏవీ ఉండకూడదు... అందుకే నీకో విషయం చెప్పేయాలనుకుంటున్నాను... అది నీ మనసుకు బాధ కలిగించవచ్చు, బాధ కలుగుతుంది కూడా! అయినా నువ్వు నన్ను క్షమిస్తావనే ధైర్యంతో చెబుతున్నాను. నేను నిజంగా తొందరపడ్డాను.... క్షమించరాని తప్పుచేశాను.

బెంగుళూరులో నేనుండే ఫ్లాట్‌కు ప్రక్క

పోర్షనులో ఒక మిలిటరీ కమాండర్ వున్నాడు. ఆయన పేరు దిలీప్ సింగ్! దిలీప్ సంగ్‌కు ఒక్కతే కూతురు. పేరు సుల్తానా ! వయస్సు పదిహేడు సంవత్సరాలు.... సుల్తానా నా గదికి వచ్చి కబుర్లు చెబుతూ, గంటలు గంటలుగా ఉండిపోయేది. అంకుల్ - అంకుల్ అంటూ జోకులు వేసి అల్లరి చేసేది... ఆటపట్టించేది. అప్పుడప్పుడు నా దగ్గర తెలుగు నేర్చుకునేది... నాకయితే హిందీ అనర్గళంగా మాట్లాడడం వచ్చింది. కాని ఆమెకు తెలుగు మాట్లాడడం కొద్ది కొద్దిగానే వచ్చింది.

ఆ రోజు ఆ అమ్మాయి పేరెంట్స్ ఏదో పార్టీకి వెళ్ళారు... రాత్రి ఎనిమిది గంటలయ్యింది... నా ఎదురుగా సుల్తానా కూర్చుని తుళ్ళిపడుతూ కబుర్లు చెబుతోంది. ఆమె గుండెలు ఎగిసెగిసి పడుతున్నాయి... యవ్వనం ఆ అమ్మాయిలో బుసలు కొడుతున్నట్టనిపించింది.

ఆ క్షణంలో సుల్తానా రూపం, అందం నన్ను పిచ్చివాణ్ణి చేశాయి. ఏదో మహమ్మారి నాలో ప్రవేశించింది. ఏదో ఉద్రేకం... ఉన్మాదం ! దగ్గరగా వెళ్ళి సుల్తానాను గట్టిగా కౌగిలించుకున్నాను. ఉక్కిరి బిక్కిరి చేశాను. సుల్తానా బిత్తరపోయింది. గిజాయించుకుంది... వదులు వదులంటూ పెనుగులాడింది. కాని నా పిచ్చి ఉద్రేకంలో ఆమె అభ్యర్థన వినిపించుకోలేదు. నా శారీరక బలం ముందు ఆమె ఓడిపోయింది. నిస్సహాయంగా తన శీలాన్ని కోల్పోయింది.

నవీన్ చెప్పటం ఆపి శిరీష వైపు చూశాడు... శిరీష మెదడు దిమ్మెత్తిపోయింది... "ఏమిటిది ? తను ఏం వింటోంది ? బావ నవీన్, ఒక అమ్మాయిని పాడు చేశాడా ?" ఆమె అయోమయంగా చూసింది. అర్థమవనట్టుగా చూసింది. "బావ నవీన్ గొంతులో నిజాయితీ ధ్వనిస్తోంది... పశ్చాత్తాపం పలుకుతోంది... ఎలా అర్థం చేసుకోవడం ?"

"నిజం శిరీ ! ఆ అమ్మాయిని నేను నిజంగా పాడు చేశాను... పాడు చేసిన తరువాత గాని నేనెంత తప్పు చేశానో అర్థం కాలేదు... అప్పుడు సుల్తానా నావైపు చూసిన చూపులు నన్ను అసహ్యించుకున్న తీరు... నేను జన్మలో మరచిపోలేను... బయటికి వెళ్ళిపోతూ ఆ అమ్మాయి అన్న మాటలు అంతకంటే మరచిపోను !

"అంకుల్ ! నువ్వెంతో మంచివాడివనుకున్నాను... జంటిల్‌మన్‌గా భావించాను. నువ్వింత నీచానికి పాల్పడతావని అనుకోలేదు. నీలో ఇంతకుత్సితం, దుర్మార్గపు బుద్ధీ... దాగి ఉన్నాయని ఏ క్షణంలోనూ తలచలేదు.

ఛీ ! ఛీ ! నీ ముఖం చూస్తేనే పరమ అసహ్యం ! ఇప్పుడు నువ్వుచేసిన పనికి ఏమైనా చేయగలను... డాడీతో చెబితే ఇదే స్పాట్‌లో నిన్ను షూట్‌చేసి గాని వదలరు... కాని చెప్పను... ఎందుకో తెలుసా ? తెలివి తక్కువ తనంగా అజ్ఞానంగా... అమాయకంగా నీతో స్నేహం చేసినందుకు నాలో నేనే బాధపడతాను... వాళ్ళను బాధపెట్టను. నువ్వు నన్నేదో చేశావని నేనేమీ క్రుంగిపోను.

నిజానికి నువ్వు నన్నేమీ చేయలేదు... నా శరీరాన్ని ముట్టుకున్నంతలో నేనేమీ చెడిపోలేదు. నా శీలం పోలేదు... నా మనసు నిర్మలంగా ఉంది. పవిత్రంగా ఉంది. నాకు మా కజిన్‌తో ఎంగేజ్‌మెంట్ ఆల్ రడీ ఫిక్స్ అయింది. నెక్స్ట్ మంత్‌లోనే మా మ్యారేజ్! గుడ్‌బై! మళ్ళీ ఎప్పుడూ నీ ముఖం నాకు చూపించకు !" నవీన్ చెప్పటం ఆపి తలదించుకున్నాడు.

"శిరీషా ! నేను నిజంగా తప్పు చేశాను... ఆ అమ్మాయి రూపమే ఇంకా నా కళ్ళల్లో కదుల్తోంది... ఆమె మాటలే నాలో ములుకుల్లా మెదులున్నాయి...శిరీ! నువ్వు నన్ను క్షమించానంటే గాని నాకు మనశ్శాంతి ఉండదు... నిన్ను పెళ్ళి చేసుకునే భర్తగా... ఈ విషయం నీకు చెప్పేయాలనుకున్నాను... చెప్పేశాను. "నువ్వు నన్ను క్షమిస్తావనే నా నమ్మకం ! క్షమిస్తావు కదూ ! ప్లీజ్!'

నవీన్ ఆర్తిగా... ఆర్ద్రంగా నిలువునా చలించిపోతున్నట్లుగా శిరీష రెండు చేతులూ

పట్టుకున్నాడు...

శిరీష ఆలోచించలేక పోతోంది. ఆమె అంతరంగం అల్లకల్లోలంగా ఉంది...

బావ నవీన్ కూడా ఉద్రేకంలో ఒక అమ్మాయిని పాడు చేశాడా ? ఎంత తప్పు చేశాడు? క్షమించరాని తప్పు కదూ ! కాని ఆ అమ్మాయి క్షమించింది... అదృష్టవశాత్తూ ఏ గొడవా చేయకుండా బావను వదిలి పెట్టేసింది... పైగా ఆ అమ్మాయి తను చెడిపోలేదని వాదించింది.

ఎంత ధైర్యం ! తన మనసు నిర్మలంగా పవిత్రంగా ఉందని చెప్పింది... తన కజిన్‌ని పెళ్ళి చేసుకుంటానని కూడా చెప్పింది.... తన మీద తనకు ఎంత నమ్మకం ! అవును... జరిగిన సంఘటనలో ఆమె తప్పు లేదు... శీలం కోల్పోవడం ఏమిటి ? ఆడదే శీలం కోల్పోతే... మగవాడూ అంతేగా ! అయినప్పుడు... ఆడదే ఎందుకు క్రుంగిపోవాలి ?

సుల్తానాలా తనూ, మనసు ఎందుకు మార్చుకోకూడదు ? బ్రతుకు మీద నమ్మకాన్ని... ఆశని ఎందుకు పెంచుకోకూడదు ? బావను ఎందుకు పెళ్ళిచేసుకోకూడదూ ? తనపై దౌర్జన్యం జరిగింది... అందులో తన తప్పు లేదు. తన మనసు నిర్మలంగా ఉంది... పవిత్రంగా ఉంది... చిన్నప్పటినుంచీ బావనే ఆరాధించింది... అవును... బావను ఒదులుకోలేదు... బావ ఉద్రేకంలో తనూ తప్పుచేశాడు... తప్పుచేసినట్టుగా తన ముందు ఒప్పుకున్నాడు...

"పద బావా ! ఇంటికి వెళ్దాం !" శిరీష లేచింది. నవీన్ చేయిపట్టుకుంది... ఆమె మనసిప్పుడు తృప్తిగా ఉంది... ఏదో ప్రశాంతంగా ఉంది. ఆనందంగా ఉంది... బావతో ఇక ఏ విషయం చెప్పక్కర్లేదు, అనుకుంటూ మనసును సరిపుచ్చుకుంది.

"శిరీష ముఖంలో కనిపించిన భావాల్ని చూసి సంతృప్తిగా నిట్టూర్చాడు నవీన్. ఆమె తనను మనస్ఫూర్తిగా క్షమించినట్లే అనిపించింది. ఉత్సాహంగా ఆమెను దగ్గరకు తీసుకుని కూడా నడిచాడు... ఇద్దరూ పార్కులోంచి బయటకు వచ్చారు. ఆకాశంలో చంద్రుడు విరగబడి నవ్వుతున్నాడు... వెన్నెల వర్షం కురుస్తోంది ఆ వర్షంలో తడుస్తూ ఇద్దరూ ఇంటికొచ్చారు. మనసులు ఆనందంతో తుళ్ళిపడుతున్నాయి.

"శిరీ ! రేపు పదవ తేదీన మావయ్యను ముహూర్తం పెట్టేయమంటాను. ఓ.కే !" నవీన్ శిరీషతో అన్నాడు.

శిరీష ఇంట్లోకి వెళ్తూ తల ఊపి... 'నీ ఇష్టం బావా' అంటూ చిన్నగా నవ్వి సిగ్గుతో లోపలికి వెళ్ళిపోయింది. నవీన్ ముందుకు నడిచాడు... అతను భారంగా ఓ నిట్టూర్పు విడిచ్చాడు.

"శిరీషా ! నిజానికి నేనేమీ తప్పు చేయలేదు... ఏ అమ్మాయినీ పాడు చేయలేదు. కేవలం నీ మనసు మార్చటం కోసమే ఓ కట్టుకథ సుల్తానా పేరుతో నీకు చెప్పాను...

నీపై జరిగిన అఘాయిత్యం, దౌష్ట్యం నాకు పూర్తిగా తెలుసు. మావయ్య దీనంగా నీ గురించి కన్నీళ్ళు ఒలికిస్తూ నాకు ఉత్తరం రాశాడు. విషయం అంతా వివరంగా తెలియజేశాడు...

ఆడది ఏదో అఘాయిత్యానికి గురయినంత మాత్రానా తన బ్రతుకును అంతం చేసుకోవడమో... ఆజన్మాంతం కుమిలిపోతూ జీవించడమో, ఆమె బ్రతుక్కి మార్గం కాకూడదు... నీపై దుర్మార్గం జరిపింది నాలాంటి మగవాళ్ళే ! నీ తప్పు లేదు. నువ్వు చెడిపోలేదు. నీ పవిత్రత పోలేదు. నువ్వు నాదానివే ! నిన్ను వదులుకోలేను. శిరీ ! నిన్ను మనస్ఫూర్తిగా స్వీకరిస్తాను !"

నవీన్ తన యింటికి వెళ్తూ తనలో తాను అనుకున్నాడు. మనిషిగా తన శీలాన్ని మానవతా శిఖరంపై మరోమెట్టు ఎక్కించాడు !

స్వాతి మంత్లీ బహుమతి కథ
మార్చి 1986